మళ్లీ విష జ్వరాల పంజా

• పెరుగుతున్న బాధితులు • చర్యలు చేపట్టని అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీజనల్ జ్వరాలు మళ్లీ పంజా విసురుతున్నాయి. వాటిలో డెంగీ కేసులే అధికంగా ఉన్నాయి. డెంగీ కేసులు పెరుగుతుండటంతో జిల్లా వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఎక్కడ చూసినా ఇంటికొకరు జ్వరం బారిన పడి చికిత్స పొందుతున్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి..

కర్నూలు జిజిహెచ్‌లో ఓపి కోసం క్యూ కట్టిన రోగులు

ఉమ్మడి జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్నపెద్దా అనే తేడా లేకుండా వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్‌తో ప్రతి ఒక్కరూ బాధపడుతు న్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వారం రోజుల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు భారీగా కేసులు పెరుగుతున్నాయి. కర్నూలు, నంద్యాల, ఆదోని జీజీహెచ్‌ల్లో, ఎమ్మిగనూరు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగాయి. ఈ ఓపీ కేసుల్లో 60 శాతం వైరల్ ఫీవర్స్‌గా నమోదవుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులకు, గొంతునొప్పి లక్షణాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నారు. గత నెలతో పోలిస్తే వైరల్ ఫీవర్ కేసులు ఈనెల అధికంగా వస్తున్నాయి. ఇంట్లో ఒకరు తర్వాత మరొకరు విషజ్వరా లతో అల్లాడిపోతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో నీరసించి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు మాత్రమే తగ్గడం లేదని రోగులు మళ్లీ మళ్లీ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని జీజీహెచ్‌లు, డోన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు ప్రైవేటు ఆసుపత్రులు, రోగులతో కిటకిటలాడుతున్నాయి. కర్నూలు జీజీహెచ్‌లో ప్రతిరోజు ఓపీకి 2700 మంది రోగులు వచ్చేవారు. పది రోజులుగా ఈ సంఖ్య పెరిగింది. ప్రతి రోజూ ఓపీకి వచ్చే రోగుల సంఖ్య 3వేలు దాటుతోంది. వీరిలో ప్రతి రోజూ 200 మంది దాకా అడ్మిషన్ పొందుతున్నారు. ఇందులో 70 శాతం వైరల్ ఫీవర్ కేసులు ఉండటం కలవరపెడుతోంది. నంద్యాల జీజీహెచ్‌లో కూడా ఓపీ రోగుల సంఖ్య 1300 నుంచి 1500 దాకా నమోదవుతున్నాయి. ఇక ఆదోని ఆసుపత్రిలో రోజు వారి ఓపీ 800 దాటుతోంది. విషజ్వరాలు పెరగడంతో కర్నూలు జీజీహెచ్‌లో పరీక్షల కోసం వేచి చూస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఎలీసా టెస్టుల ద్వారా పాజిటివ్ వచ్చిన మాత్రమే అధికారులు డెంగీ కేసులుగా పరిగణిస్తున్నారు. అనధికారికంగా ఈ ఏడాది నమోదైన డెంగీ కేసులు వేలల్లో ఉన్నట్లు అంచనా. నంద్యాల జిల్లాలో బేతంచెర్ల, నందికొట్కూరు, డోన్, నంద్యాల ప్రాంతాల్లో డెంగీ వ్యాధిగ్రస్థుల సంఖ్య అధికంగా ఉంది.

పత్తాలేని పరీక్షలు

ఉమ్మడి జిల్లాలో పలు ఆసుపత్రుల్లో డెంగీ కిట్లు ఉన్నప్పటికీ నిర్ధారణ పరీక్షలు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. డెంగీతో పాటు వర్షాలు కురుస్తుండటంతో నీరు కలుషితం కావడంతో టైఫాయిడ్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. గ్రామాల్లో రెండు మూడు రోజులకు వైద్య సిబ్బంది చికిత్సలు అందించేందుకు వెళ్లడం లేదు. అన్ని పీహెచ్‌సీలో మధ్యాహ్నం 1 గంట తర్వాత వైద్యులు ఇంటి ముఖం పడుతున్నారు.

ప్రయివేట్ దోపిడీ

వైరల్ జ్వరాలు విజృంభిస్తుండటాన్ని ప్రయివేటు ఆస్పత్రులు ఆదాయంగా మలచుకుంటున్నాయి. జ్వరం వచ్చిందని ఆస్పత్రికి వెళితే చాలు తొలుత టెస్టుల పేరుతో వేలకు వేలు దండుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్(రక్తఫలికలు) తగ్గాయన్న పేరుతో ఆస్పత్రిలో చేరాలని భయపెడుతున్నారు. ఆస్పత్రిలో చేరితో మందులు, బెడ్ ఛార్జీలు, డాక్టర్ ఫీజులు తదితర పేర్లతో దోచుకుంటున్నారు. ఏకంగా లక్షలు వసూలు చేస్తూ రోగుల జేబులు ఖాళీ చేస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డెంగీ, మలేరియా పరీక్ష కిట్లు అందుబాటులో ఉన్నాయి. రోగుల నుంచి సేకరించిన నమూనాలను కర్నూలు జిజిహెచ్, ఆదోని ఏరియా ఆసుపత్రులకు వ్యాధి నిర్ధారణకు పంపిస్తారు. ఈ వ్యాధులకు మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాతటైర్లు, ఖాళీ డబ్బాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ డబ్బాలు ఇంటి పరిసరాలలో ఉంచకుండా. చూడాలి. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలి. నీటి తొట్టెలను వారానికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టి మరల నింపుకోవాలి. వాటర్ బ్యాంకులు, ఇంటిలో నీటి నిల్వల మీద దోమలు జొరబడకుండా మూతలు వేసి ఉంచాలి.

- నూకరాజు, జిల్లా మలేరియా అధికారి.

సంక్షోభంలో ప్రభుత్వ విద్య

• విద్యారంగ పరిరక్షణకు ఎస్ఎఫ్ఐ పోరాటం
• నేడు, రేపు, ఆలూరులో జిల్లా మహాసభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా విద్యారంగం ప్రస్తుతం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రభుత్వ నిర్లక్ష్యం, వసతులలోపం, ఉపాధ్యాయ ఖాళీలు, కార్పొరేట్ విద్యా దోపిడీ, పాఠశాలల విలీన విధానం వంటి అంశాల వల్ల జిల్లా మొత్తం విద్యా వ్యవస్థ దెబ్బతిన్నదని, విద్యార్థిసంఘాలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా 50వ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలు ఈనెల 4,5 తేదీల్లో ఆలూరు పట్టణంలో నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అనేక పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో నత్తనడకన నడుస్తుండగా, విలీన విధానం కారణంగా మూసివేసిన పాఠశాలల విద్యార్థులు మైళ్ళ దూరానికి వెళ్లి చదవాల్సిన దుస్థితి నెలకొంది. మధ్యాహ్న భోజనం నాణ్యత లోపం, తాగునీటి సమస్య, మరుగుదొడ్ల కొరత, పాడైపోయిన భవనాలు, లీకేజీలు, ఫర్నిచర్ కొరత వంటి సమస్యలు ఇంకా పరిష్కారం కావడం లేదు. జిల్లా కేంద్రంలో కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం పేరుతో తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. ఉన్నత విద్యారంగం లో కూడా పరిస్థితి తీవ్రంగానే ఉంది. రాయలసీమ యూనివర్సిటీ, పాలిటెక్నిక్, ఐటిఐలు, డిగ్రీ కళాశాల ల్లో బోధనా సిబ్బంది ఖాళీలు నిండకపోవడం, ల్యాబ్ సదుపాయాల లేమి వెంటాడుతున్నాయి. ఆదోని మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ప్రయత్నాలు, ఆలూరు ఐటిఐ భవనం శిథిలావస్తకు చేరింది. ఎమ్మిగనూరు, గూడూరు, మద్దికేర మండలాల్లో హాస్టల్ సమస్యలు, విద్యాసంస్థల్లో రాజకీయ జోక్యం పెరగడం జిల్లా విద్యా వ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెట్టాయి. గ్రామీణ ప్రాంతంలో విద్య అందుబాటులో లేకపోవడం విద్యార్థుల మధ్య అసమానతను పెంచుతున్నాయి. రవాణా సమస్యలు, బస్సుల ఫిట్‌నెస్ లోపాలు, రోడ్డు భద్రతల సమస్యలు కూడా విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదంగా మారుతున్నా యి. గత మహాసభ తరువాత జిల్లావ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు ఉద్యమాలు చేపట్టారు. విద్యారంగం సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలను తీసకెళ్లినా స్పందన లేదు. డిగ్రీ హానర్స్ రద్దు, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల, హాస్టళ్లలో మెస్‌ఛార్జీల పెంపు, పాఠశాలల విలీన విధానం వ్యతిరేక పోరాటాలు, కార్పొరేట్ పాఠశాలల దోపిడీపై చర్యలు, మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఆందోళనలు జిల్లాలో ప్రభావాన్ని చూపాయి. రాయలసీమ యూనివర్సిటీలో జీవో77 వ్యతిరేకంగా చేసిన పోరాటం విజయవంతమైంది. అవినీతి నియామకాలను అడ్డుకోవడం వంటి చర్యలు విద్యార్థి ప్రయోజనాలను కాపాడే దిశగా కార్యక్రమాలు చేశారు. అదనంగా, వసతిగహాల సమస్యలపై ప్రతిపాదనలు సమర్పించడం, పాఠశాల ఇన్‌స్పెక్షన్‌లు, మత్తుపదార్థాల వ్యతిరేక ఉద్యమాలు, సాంస్కృతిక, చరిత్ర అవగాహన కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో సామాజిక-విద్యా చైతన్యం పెంచడంలో ఎస్ఎఫ్ఐ కీలక పాత్ర పోషించింది.

ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి పోరాటం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రంగప్ప

ఆలూరులో జరగనున్న 50వ జిల్లా మహాసభల్లో కర్నూలు జిల్లా ప్రభుత్వ విద్యా రక్షణ, బలోపేతం కోసం తీర్మానం చేయనున్నాం. రాబోయే కాలంలో ముఖ్యమైన పోరాటాలను చేయనున్నాం. జిల్లా పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయ, అధ్యాపకుల పోస్టుల ఖాళీల భర్తీ కోసం ఉద్యమాలు చేస్తాం. ఆదోని మెడికల్ కళాశాల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, అన్ని పాఠశాలల్లో భవన మరమ్మతులు, నీరు-మరుగుదొడ్లు, ఫర్నిచర్, డిజిటల్ సదుపాయాల కోసం ప్రత్యేక 'చలో కలెక్టర్' కార్యక్రమాలు, గ్రామీణ పేద విద్యార్థుల కోసం ప్రత్యేక క్యాంపెయిన్లు చేస్తాం. ఉచిత విద్యాహక్కు సాధన,కార్పొరేట్ పాఠశాలల, కళాశాలల ఫీజు దోపిడీపై తీవ్రంగా పోరాటాలు చేస్తున్నాం. భవిష్యత్తులో కూడా చేస్తాం. భవిష్యత్తు పోరాటాలకు మద్దతు తెలిపేందకు ఈనెల 4న ఉదయం 11 గంటలకు ఆలూరులో నిర్వహించే బహిరంగ సభకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

పెంచలయ్య హంతకులను శిక్షించాలి

-కలెక్టరేట్ ఎదట పిపిఎస్ఎస్ ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్యను దారుణంగా హత్య చేసిన గంజాయి ముఠా గుండాలను శిక్షించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇ.పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు జె.దివాకర్, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పుల్లారెడ్డి, ఎం.నాగరాజు, ఎస్.అన్వర్ బాషా, కె.మధుసూదన్ మాట్లాడారు. ప్రభుత్వం చేయాల్సిన ప్రచారాన్ని ప్రజానాట్యమండలి కార్యకర్త మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తున్న పెంచలయ్యను ప్రభుత్వం కాపాడుకోలేక పోయిందన్నారు. గంజాయి ముఠాను, వారికి మద్దతు ఇస్తున్న వారిని ఏ స్థాయిలో ఉన్న వదలకుండా శిక్షించాలన్నారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల వ్యాపారాలపై సిబిఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎండి యూనూస్, ఎ.వెంకటేశ్వర్లు, ఎస్.రమణ గౌడ్ ,ఎన్.విజయకుమార్, ఇ.లక్ష్మణగౌడు, ఎన్.శ్రీనివాసరెడ్డి, కె.శ్రీనివాసులు, మధు, ఎ.ఆంజనేయులు గౌడు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట పిపిఎస్ఎస్ ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జె.దివాకర్

పత్తి రైతులను వెనక్కి పంపించొద్దు

- కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పత్తిలో తేమ శాతం సిసిఐ కొనుగోలు చేసే దాని కంటే ఎక్కువ ఉంటే రైతులను వెనక్కి పంపించకుండా మిల్లుల ద్వారా కొనుగోలు చేయించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మార్కెటింగ్ ఎడిని ఆదేశించారు. బుధవారం ఆదోనిలో బత్తిన అభిరామ్, లక్ష్మీ చెన్నకేశవ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ యూనిట్లలో సిసిఐ ద్వారా జరుగుతున్న పత్తి కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఏ మండలం నుండి వచ్చారని, తీసుకొచ్చిన పత్తిని సిసిఐ వారు కొనుగోలు చేశారా, ఏమైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. తాము తీసుకొచ్చిన పత్తిని తేమ శాతం ఆధారంగా సిసిఐ వారు కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. కొంచెం రంగు మారినా కొనుగోలు చేయడం లేదని, స్లాట్ బుకింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. స్లాట్ బుకింగ్ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు కలెక్టర్ తెలిపారు. స్లాట్ బుకింగ్ సమయంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది సహాయం చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పత్తిని తీసుకొచ్చే సమయంలో బాగా ఆరబెట్టి, పొట్టు తీసుకొని రావాలని సూచించారు. వచ్చేసారి పత్తి పంట వేస్తే ఇప్పటి లాగా పత్తి పంట ఒక్కటే వేసి వాటి మీద ఆధారపడకుండా, పత్తి పంట మధ్యలో కంది పంట వేయాలని తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాల్లో సాంకేతిక లోపాలు లేకుండా చూడాలన్నారు. తూకపు యంత్రాలు, మాయిశ్చరైజర్ మిషన్‌ను స్వయంగా పరిశీలించారు. అనంతరం పత్తి తేమ శాతం ఎంత ఉందని కలెక్టర్ మాయిశ్చరైజర్ మిషన్ ద్వారా పరిశీలించారు. ఆదోని ఇన్‌ఛార్జీ సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, మార్కెటింగ్ ఎడి నారాయణమూర్తి, ఎడిఎ బాలవర్ధిరాజు, ఆదోని తహశీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పరిశీలించారు. కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాఘవేంద్ర చౌదరి కృషి విజ్ఞాన కేంద్రం చేపడుతున్న పరిశోధనలు, రైతుల కోసం అమలు చేస్తున్న సాంకేతిక శిక్షణలు, ప్రదర్శనల ఫలితాలు, జిల్లా వ్యవసాయ అభివృద్ధికి కెవికె చేస్తున్న కృషిని వివరించారు. అనంతరం కలెక్టర్ శాస్త్రవేత్తలతో చర్చించి, పంటల్లో కొత్త సాంకేతికతలు, వాతావరణ మార్పులు, పంట నిర్వహణ, నీటి సంరక్షణ, పోషక నిర్వహణ, పురుగుల సమగ్ర నిర్వహణ వంటి ముఖ్య అంశాలపై జిల్లాకు అనువైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించే దిశగా సూచనలు చేశారు. రైతులకు ప్రత్యక్ష లాభం చేకూరే విధంగా ప్రాంగణ ప్రదర్శనలు, ఫీల్డ్ విజిట్లు, డిజిటల్ ఎక్స్‌టెన్షన్ సేవలను మరింత విస్తరించాలని సూచించారు. ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ శివశంకర్, ఉద్యానవన శాఖ అధికారి బి.శ్రీవాణి పాల్గొన్నారు. అలాగే మండలంలోని కడిమెట్ల రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన 'రైతన్న మీకోసం' ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్ సిరి వీక్షించారు. సబ్ కలెక్టర్ (ఇన్‌ఛార్జీ) అజయ్ కుమార్, ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, తహశీల్దార్ శేషఫణి పాల్గొన్నారు.

ఆదోనిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

అంగన్వాడీ టీచర్ సస్పెన్షన్

కోడుమూరు : మండలంలోని గోరంట్ల 4వ అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్రంలో అపరిశుభ్రతపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడి కేంద్రంలో సరుకులు లెక్కల్లో తేడాలు, కోడిగుడ్లలో నాణ్యత లేకపోవడాన్ని గుర్తించారు. కలెక్టర్ అంగన్వాడీ టీచర్ ఫాతిమాను అక్కడికక్కడే సస్పెన్షన్ చేస్తున్నట్లు ప్రకటించారు. అంగన్వాడీలపై పర్యవేక్షణ సరిగా చేయని సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆమె ఆదేశించారు. అంగన్వాడి కేంద్రంలో ఉన్న 13 మంది పిల్లలతో మాట్లాడి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. విధుల పట్ల ఎలాంటి అలసత్వం వహించినా సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. సిడిపిఒ వరలక్ష్మీదేవి ఉన్నారు.

కోడుమూరు అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సిరి

స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్‌పి బాబు ప్రసాద్

ప్రజాశక్తి-కోడుమూరు

కోడుమూరులో స్థానిక పోలీస్ స్టేషన్‌ను కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కోడుమూరు పోలీస్ స్టేషన్ , కోడుమూరు సర్కిల్ ఆఫీసును తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఆఫీసు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణ పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది చట్టాలపై అవగాహన పెంచుకొని మంచి నడవడికతో ఉండాలని సూచించినారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తబ్రేజ్ , కోడుమూరు ఎస్ఐ డివై స్వామి, పిఎస్ఐ మణికంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

5న కెవిఆర్‌లో క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 5న కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జోహార్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వెంకటరెడ్డి జెకెసి కోఆర్డినేటర్ ఎస్ఎంబాష బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్ నుండి డిగ్రీ వరకు కోర్సులు చేసిన వారు ఉదయం 10 గంటలకు విద్యార్థులు తమ విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

ఐసిడిఎస్ పిడికి వినతిపత్రం ఇస్తున్న పి.నిర్మల, లలిత, తదితరులు

12న అంగన్వాడీలు చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు , ఎఐటియుసి అనుబంధ సంఘాల నాయకులు పి.నిర్మల, లలిత పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఐసిడిఎస్ పిడి విజయను రెండు యూనియన్ల ప్రతినిధుల బృందం కలిసి చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ 2023వ సంవత్సరంలో సమ్మెకాలానికి సంబంధించిన హామీలను అమలు చేయాలని కోరారు. అంగన్వాడి హెల్పర్స్ యూనియన్ ఇరు సంఘాల నాయకులు దుర్గమ్మ, కాంతమ్మ, సిఐటియు నగర న్యూ సిటీ కార్యదర్శి నరసింహులు, ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్ కేసుల పై కమిషనరు సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలోని అన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులతో వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ బుధవారం స్క్రబ్ టైఫస్ పరిస్థితి పై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎల్. భాస్కర్‌తోపాటు వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 సంవత్సరంలోమొత్తం 6,778 నమూనాల్లో 1,346 కేసులు నిర్ధారించబడ్డాయని కర్నూలు జిల్లాలో 508 నమూనాల్లో 50 కేసులు నమోదయ్యాయని తెలిపారు. జిల్లావైద్య , ఆరోగ్యశాకాధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ మాట్లాడుతూ ఈవ్యాధి తీవ్రమైనది కాదని తక్షణ చికిత్సతో పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. ఒరియెంటియా సుట్సుగముశి అనే బ్యాక్టీరియాతో పాడిపొలాలు, దట్టమైన పొదలలో ఉండే చిగ్గర్ మైట్ లార్వా కాటుతో వ్యాపిస్తుందని వివరించారు. అధికజ్వరం, తలనొప్పి, శరీరనొప్పులు, దద్దుర్లు, కాటు దగ్గర నల్లరంగుపట్టు (ఎస్కార్) లక్షణాలు వుంటాయని అన్నారు. వైరల్ ఫీవర్‌గా పొరబడే అవకాశం ఎక్కువ ఉందని 3 రోజులకుపైగా జ్వరం ఉంటే సమీప పీహెచ్సి/యూపీహెచ్‌సిలను సంప్రదించాలని సూచించారు. డాక్సీసైక్లిన్, అజిత్రోమైసిన్ వంటి మందులు జిల్లాలోని అన్ని పీహెచ్సి/యూపీహెచ్‌సిలలో సరిపడా నిల్వలో ఉన్నట్లు తెలిపారు. ఐడిఎస్‌పి, ఎపిడామిక్‌బృందాలు చురుకుగా ఫీల్డ్ మానిటరింగ్ నిర్వహిస్తున్నాయని ప్రజలు పొదల ప్రాంతాలను నివారించడం, వ్యవసాయక్షేత్రాల్లో రక్షణదుస్తులు ధరించాలని, కీటక నాశిని రెపెలెంట్లు ఉపయోగించడం దోమ జాలాలు ఉపయోగించాలని పొదల్లో బయట నిద్రించకూడదని, 3 రోజులకుపైగా జ్వరం ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని, ఈ జాగ్రత్తలుపాటించాలని సూచించారు. స్క్రబ్ టైఫస్ నివారించగలిగినదే, చికిత్స చేయగలిగినదని త్వరిత గుర్తింపే కీలకమన్నారు. వెంటనే చికిత్సపొందాలనిస్వయంగా మందులు వాడవద్దని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత పరీక్షలు, చికిత్స అందుబాటులో ఉన్నాయన్నారు. డిపిఎంయు డాక్టర్ శైలేష్ కుమార్, గణాంక అధికారి హేమసుందరం, మలేరియ అధికారి నూకరాజు, డెమో అధికారి ప్రకాశ్ రాజు, డిప్యూటీ డెమో పద్మావతి, డిపిఒ విజయరాజు, (ఎపిడామిక్) జిల్లా రాపిడ్ రెస్పాండ్ టీం వేణుగోపాల్ యాదవ్, చలపతి, మొక్షేశ్వరుడు పాల్గొన్నారు.

కెఎంసి ఫార్మకాలజీ విద్యార్థినికి మొదటి బహుమతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు వైద్య కళాశాలకు చెందిన ఫార్మకాలజీ పీజీ విద్యార్థిని డాక్టర్ ఎస్. జ్యోత్స్న నవంబర్ 28, 29 తేదీలలో కోయంబత్తూరులో జరిగిన జాతీయ స్థాయి ఫార్మకాలజీ సదస్సు నాప్టికన్ 2025 లో పాల్గొని, పేపర్ ప్రెసెంటేషన్ విభాగంలో జాతీయ స్థాయిలో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు

ఫార్మకాలజీ విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ చిట్టినరసమ్మ

బుధవారం కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ ఆ విద్యార్థినితో పాటు ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.రాజేష్‌ను అభినందించారు. ఆ విద్యార్థినిని మిగిలిన విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఫార్మకాలజీ ఇతర అధ్యాపకులు డాక్టర్ రాజేశ్వరమ్మ ,డాక్టర్ రవిరాజ్, డాక్టర్ హరిత , డాక్టర్ భానుప్రకాష్ , డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ , ఇతర పీజీలు పాల్గొన్నారు.

ఎక్స్ ప్రెస్ రైలును మద్దికేర స్టేషన్లో ఆపాలి

-రైల్వే అధికారులకు మండల ప్రజలు విన్నపం-ఎంపి చొరవ చూపాలి

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికేర రైల్వే స్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైలు ఆగపోవడంతో, మద్దికేర మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్ నుంచి మద్దికేర మీదుగా, అమరావతి, ప్రశాంతి ఎక్స్ ప్రెస్‌లు ప్రతిరోజు వెళ్తుంటాయి. తుగ్గలి మద్దికేర మండలాల ప్రజలు రాష్ట్ర రాజధాని అయిన అమరావతి వెళ్లేందుకు, ఎంతో అనువుగా ఉంటుంది. నిత్యం ఈ స్టేషన్ నుంచి విజయవాడకు, వందల సంఖ్యలో ప్రయాణికులు వెళ్తుంటారు. మద్దికేర రైల్వే స్టేషన్లో అమరావతి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు నిలపకపోవడంతో 15 కిలోమీటర్లు దూరంలో ఉన్న గుంతకల్లు రైల్వే స్టేషన్ కు వెళ్లి ఎక్కాల్సి వస్తుంది.

ఎంపీ చొరవ చూపాలి...

మద్దికేర రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు ఆపేందుకు, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు. గతంలో ఈ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు విద్యావంతులు, అధికారులు ప్రజలు, ఎంపీబస్తీపాటి నాగరాజు మద్దికేరకు వచ్చిన ప్రతిసారి, విన్నవిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా ఉంది. గతంలో ఎంపీగా ఉన్న బుట్టా రేణుక, రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఎక్స్‌ప్రెస్ రైలును మద్దికెరలో ఆపేందుకు కృషిచేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కరోనా సమయంనుంచి ఎక్స్‌ప్రెస్ రైలను, నిలపకుండా ఉన్నారు. అప్పటినుంచి ఈ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు ఆగక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

ఎక్స్ ప్రెస్ రైలు ఆగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం

- రామాంజనేయులు

ఎక్స్ ప్రెస్ రైలు మద్దికేర స్టేషన్‌లో ఆగకపోవడం వల్ల, వందలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. తుగ్గలి ,మద్దికేర మండలాల నుంచి రోజు పదుల సంఖ్యలో, విజయవాడకు వెళ్తుంటారు. ప్రజా ప్రతినిధులు చొరవ చూపి మద్దికేర రైల్వేస్టేషన్‌లో రైళ్లను ఆపేలా చూడాలి.

ఎక్స్ ప్రెస్ రైలును ఆపాలి

సిఐటియు మండల కార్యదర్శి రాముడు

మద్దికేర రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలును ఆపేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలి. మద్దికేర తుగ్గలి మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ప్రజా ప్రతినిధులు చొరవ చూపి రైలును ఆపాలి.

తనిఖీల పేరుతో అంగన్‌వాడీలపై చర్య తగదు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లా లో అనేక రకాల సమస్య లుండగా వాటి గురించి కాకుండా చాలిచాలని వేతనాలు, కనీస సౌకర్యాలు కల్పించలేని అంగన్వాడీ కేంద్రాల తనిఖీ చేయడం, హెచ్చరించడం కాకుండా టర్మినేషన్ చేయడం కలెక్టర్‌కు తగదని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, అంజిబాబు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో సూచించారు. ఐసిడిఎస్ వేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉందని, అంగన్వాడి కేంద్రాలకు సొంత భవనాలు లేవు. ప్రభుత్వం యిచ్చే అద్దెలకు గ్రామాల్లో గాని పట్టణంలో గాని ప్రభుత్వ అధికారులు ఊహించే విధంగా ఇండ్లు దొరకవని అన్నారు. అద్దెలకు సంబంధించిన బిల్లులు చేయడంలో కూడా అధికారుల చేతివాటం ఉంటుందని, వారికి టిఎడిఎ.లు సక్రమంగా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే మెనూ నిధులు ఏ మూలకు సాలవడం లేదని, పాలు, గుడ్లు, కందిపప్పు చెడిపోయిన ముక్కిపోయిన వాటిని అందజేస్తారన్నారు. వీటిని సరఫరా చేసే వాళ్ల అధికార పార్టీ సంబంధించిన వారేనన్నారు. వారిపై చర్య తీసు కోకుండా, తప్పును సరి చేయడానికి కలెక్టర్ స్థాయి అధికారులు కూడా ప్రయత్నం చేయకుండా, అంగన్వాడి వర్కర్లు, ఆయాలపై ఈ విధంగా చర్యలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కొత్త కొత్త యాపులు తీసుకొని రావడంతో పని భారం పెరగడంతో పాటు సెల్లులు కూడా ఆ పనులు చేయడానికి సరిపోవడం లేదన్నారు. తనిఖీలు చేయడానికి ఆగ మేఘాల పై వచ్చి, ఎటువంటి హెచ్చరికలు చేయకుండా రెగ్యులర్ ఉద్యోగస్తులపై కూడా ఇటువంటి క్రమశిక్షణ తీసుకోరని, గౌరవవేతనంతో విధులు నిర్వహిస్తున్న వారి పై టర్మినేషన్ లాంటి చర్యతీసుకో వడం న్యాయ సమ్మతం కాదన్నారు. అందువలన టర్మినేషన్‌ను రద్దు చేయాలని కోరారు.

రైతన్న మీ కోసంలో ఐదు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి-సి బెళగల్

రైతన్న మీ కోసం కార్యక్రమం ముగింపు అనంతరం ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోరి ఐదు సూత్రాలను అందుబాటులోకి తెచ్చిందని ఎఒ మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం వ్యవసాయ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత నెల నవంబర్ 24 నుండి 29 వరకు చేపట్టిన రైతన్న మీ కోసంలో భాగంగా ప్రతి ఇంటా రైతులను సందర్శించగా 48.73 శాతం నమోదు అయినట్లు తెలిపారు. ముఖ్య ప్రణాళిక 2025 నుండి 2027 వరకు ఐదు సూత్రాలు అగ్రిమాల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆధారిత వ్యవసాయం, నీటిభద్రత, ధరల నిర్దిష్టత వంటివి అందుబాటులోకి తెచ్చిందని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత మనకంతా ఉందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఒ మల్లేష్‌కుమార్

పోలీసు స్టేషన్‌లో ఎస్పీ వార్షిక తనిఖీలు

ప్రజాశక్తి - హాలహర్వి


హాలహర్వి స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

వార్షిక తనిఖీలో భాగంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాలహర్వి పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. బుధవారం రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లోని పెండింగ్ కేసులు, వాటి స్థితిగతులు, నిందితుల అరెస్ట్, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతిపై ఫైల్లను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి ఆరా తీశారు. డ్రంకెన్ డ్రైవ్, డ్రింకింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సైబర్ నేరాలపై, మహిళల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సిఐ రవి శంకర్ రెడ్డి, డిసిఆర్‌బి సిఐ గుణశేఖర్ బాబు, ఎస్ఐ మారుతి, మన్మథ విజయ్ ఉన్నారు. **హోళగుంద** పోలీసు స్టేషన్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ గావించారు. డీఎస్పీ వెంకట్రాముడు, ఆలూరు సిఐ రవిశంకర్ రెడ్డి ఉన్నారు. ముందుగా ఆయన స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయనను టిడిపి నాయకులు డాక్టర్ తిప్పయ్య, మోయిన్, అబ్దుల్, సుభాన్, రహిమాన్, ఐటిడిపి నాయకులు హనుమంతు, సురేష్ గౌడ్‌లు పూలమాల, శాలువా వేసి సన్మానించారు. ఎస్ఐలు మారుతి, దిలీప్ కుమార్, రాజా కుళ్లాయప్ప పాల్గొన్నారు.

గమ్యం చేరేదెలా..?

- ప్రభుత్వాలు మారినా మారని రోడ్డు దుస్థితి
- నాయకులు, అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - నందవరం

ముగతి నుంచి నాగలదిన్నె వెళ్లే రోడ్డు ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. అధ్వాన్నమైన రోడ్డుపై గమ్యం చేరేదెలా అంటూ ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సుదూర ప్రాంతాల నుంచి తమ గ్రామాలకు వచ్చిన బంధువులు తిరిగి వెళ్లే సమయంలో రోడ్డుపై ఉన్న గుంతలు గమనించక అకస్మాత్తుగా పడి ప్రమాదాలకు గురవుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. రైతులు పొలాలకు వెళ్లే సమయంలో బస్సు అదుపు తప్పి ఎద్దుల బండ్లను ఢీకొన్నాయి. ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయం. మహిళలకు ఫ్రీ బస్సు కేటాయించడం వల్ల ఆటోలు సరిగా నడవక, ఆటోలో తక్కువ మందితో ప్రయాణిస్తూ చాలీచాలని సంపాదనతో జీవనం సాగిస్తున్నారు. గుంతల రోడ్డు వల్ల ఆటో మైలేజ్ రాక, మరమ్మతులకు గురవుతున్నాయి. వచ్చిన సంపాదనలో సగభాగం ఆటో మరమ్మతులకే వెచ్చిస్తున్నామని డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. బుధవారం నాగలదిన్నె వైపు ప్రయాణిస్తున్న వాహనం రోడ్డుపై ఉన్న గుంతలో ఇరుక్కుపోయింది. వేరే వాహనం ద్వారా మూడు గంటలు శ్రమించి వాహనాన్ని బయటికి తీశారు. ఆ సమయంలో వాహన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ప్రధాన రహదారిపై నడిరోడ్డుపై వాహనం ఇరుక్కోవడమేమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. రోడ్డు ధ్వంసమై ప్రమాదాలు జరుగుతున్నా నాయకులు, అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సమస్యపై అధికారులను వివరణ కోరిన ప్రతిసారీ 'నివేదిక పంపాం' అని చెబుతున్నారు. కనీసం ప్రమాదాలు జరగకుండా గుంతలు కూడా పూడ్చలేకపోవడం ఆలోచించదగ్గ విషయం.

రోడ్డుపై ఇరుక్కుపోయిన వాహనం

ప్రభుత్వాలు మారినా మారని రోడ్డు దుస్థితి

- సిపిఎం మండల బాధ్యులు సి.గురుశేఖర్

ప్రభుత్వాలు మారినా నందవరం రోడ్డు పరిస్థితి మారడం లేదు. రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదాలకు నిలయంగా మారింది. కూటమి ప్రభుత్వం స్పందించి హైవే రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలి.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

- విజయ నరేష్, ఆర్‌అండ్‌బి అధికారి

రోడ్డు నిర్మాణం, రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులూ రాలేదు.

రైతులకు అందుబాటులోకి యూరియా

ప్రజాశక్తి - గోనెగండ్ల

యూరియాను పంపిణీ చేస్తున్న నాయకులు

రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడకుండా కైరవాడిలోని సహకార సొసైటీలో యూరియా నిల్వలను అందుబాటులోకి తెచ్చినట్లు హెచ్.కైరవాడి వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు కె.తిమ్మారెడ్డి, ఎడిఎ మహ్మద్ ఖాద్రీ తెలిపారు. బుధవారం మండలంలోని హెచ్.కైరవాడి సొసైటీలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ... రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడకుండా రైతు సేవా కేంద్రాలతో పాటు సహకార సొసైటీలో యూరియా అందుబాటులోకి తెచ్చామన్నారు. సొసైటీలో 25 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో సొసైటీ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. సొసైటీ సిఇఒ ప్రకాష్ రెడ్డి, సిబ్బంది గోపాల్ రెడ్డి, దినేష్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

- కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు

విద్యుత్ స్తంభాల ఏర్పాటులో పాల్గొన్న జనసేన నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ గ్రామం లోని 2వ వార్డులో చెన్నకేశవ స్వామి ఇనాం భూమిలో నివాసం ఉంటున్న దాదాపు 30 కుటుంబాల కోసం జనసేన నాయకుల ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన వీర మహిళ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సరోజ, నాయకులు కటిక ఉచ్చీరప్ప, రామాంజనేయులు మాట్లాడారు. రెండేళ్లుగా కట్టెల ఏర్పాటుతో విద్యుత్ వైర్లు ఉండడంతో ప్రమాదకరంగా జీవనం కొనసాగిస్తుస్తున్నామని, సమస్యను కాలనీవాసులు విన్నవించారని తెలిపారు. సమస్యను విద్యుత్ ఎఇ రవీంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారని చెప్పారు. జనసేన నాయకులు వడ్డే గోవిందు, బొడ్డు నాగరాజు, రమేష్, పరమేష్, బాలు, బ్రహ్మానంద పాల్గొన్నారు.

4వ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక

- జిల్లా అధ్యక్షులుగా ఉపేంద్ర, కార్యదర్శిగా మహ్మద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎపి ప్రభుత్వ 4వ తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి బనవాసి ఫారం మహ్మద్ బుధవారం తెలిపారు. రాష్ట్ర మాజీ అధ్యక్షులు సి.గోపాల్ కృష్ణ, నంద్యాల జిల్లా అధ్యక్షులు జి.గోవిందు సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బి.ఉపేంద్ర, సహాయ అధ్యక్షులుగా పి.అబ్దుల్ మజీద్, ఉపాధ్యక్షులుగా కె.సుభాకర్, రామకృష్ణ, కార్యదర్శిగా ఎం.మహ్మద్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.చాంద్ బాషా, ట్రెజరర్‌గా ఎం.బాల స్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.యశ్వంత్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చావులోనూ వీడని బంధం

- గంటల వ్యవధిలో వృద్ధ దంపతులు మృతి

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని డి.బెళగల్ గ్రామంలో వృద్ధ దంపతులు గంటల వ్యవధిలో మృతి చెందారు. స్థానికులు, గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు... డి.బెళగల్ గ్రామానికి చెందిన వై.వీరారెడ్డి (80), వై.పార్వతమ్మ (75) వృద్ధ దంపతులు ఒకరికొకరు తోడుగా తనువు చాలించారు. 60 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వై.వీరారెడ్డి మంగళవారం రాత్రి 9.30 గంటలకు మృతి చెందగా, పార్వతి బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు మృతి చెందారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గ్రామంలో మంచి పేరున్న కుటుంబం కావడంతో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఫోన్‌లో సంతాపం తెలిపారు. దంపతుల మృతదేహాలకు మురళీమోహన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వృద్ధ దంపతులు మృతదేహాలు

యుటిఎఫ్ మోడల్ పేపర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆదోని రూరల్

మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

ఆదోని ఎంఆర్‌సి భవనం ముందు ఉప విద్యాధికారి రాజేంద్ర ప్రసాద్, ఎంఇఒలు భూపాల్ రెడ్డి, శ్రీనివాసులు, యుటిఎఫ్ నాయకుల చేత యుటిఎఫ్ పదో తరగతి మోడల్ పేపర్లను ఆవిష్కరించారు. అనంతరం ఉప విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన జి.రాజేంద్రప్రసాద్‌ను పూలమాల, శాలువాతో సన్మానించారు.

దేవరగట్టు ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - హోళగుంద

హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

మండలంలోని దేవర గట్టు ప్రాంతంలో వెలసిన శ్రీమాల మల్లేశ్వర స్వామి ఆలయ హుండీని బుధవారం టిడిపి ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ ఆదేశాల మేరకు ఆలయ కమిటీ ఛైర్మన్ వీర నాగప్ప ఆధ్వర్యంలో లెక్కించారు. నాలుగు నెలల హుండీని లెక్కించగా రూ.7.20 లక్షలు, వెండి 20 గ్రాముల వెండి ఆలయానికి ఆదాయంగా వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఎస్ఐ దిలీప్ కుమార్, పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు రాము నాయక్, మల్లికార్జున నాయక్, లోక్యా నాయక్, బోయ మల్లికార్జున పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి - దేవనకొండ

క్రిస్మస్ పండగ సందర్భంగా మండలంలోని తెర్నేకల్ గ్రామంలో నిర్వహించే జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ కరపత్రాలను ఎబిఎం చర్చి యూత్, గ్రామ పెద్దలు నారాయణ రెడ్డి, మాజీ సర్పంచి బాటమీద రాజన్న, మాజీ ఉపసర్పంచి గిరిపోగు సత్యరాజు ఆధ్వర్యంలో బుధవారం విడుదల చేశారు. సంఘ పెద్దలు మలిగేలి నరసింహులు, గిరిపోగు అబ్రహాం, నల్లమల శాంతరాజు, ఎం.సుధాకర్ బాబు, ఎన్.లక్ష్మన్న పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం


రైతులను సన్మానిస్తున్న నాయకులు

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రైతుల అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో 'రైతన్న మీకోసం'లో పాల్గొన్న ఆయన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం నూతన పద్ధతులతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించే విధంగా ఆలోచనలు ఉండాలని తెలిపారు. అంతకుముందు తూర్పుగోదావరి జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన 'రైతన్న మీ కోసం'ను అధికారులతో కలిసి వీక్షించారు. చెట్నిహళ్లి రైతులకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ నూర్జహాన్, ఎఒ జీరా గణేష్, ఎఇఒ తిరుమల రెడ్డి, మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్, డిసి తిమ్మప్ప, కల్లుదేవకుంట సొసైటీ డైరెక్టర్ ఆర్.లక్ష్మన్న, మాజీ సర్పంచి చావిడి వెంకటేష్, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, మంత్రాలయం పట్టణ అధ్యక్షులు వరదరాజులు, ఎల్ఎల్‌సి డిసి ఛైర్మన్ సూగూరు నరసింహ, నాయకులు నాగరాజు, మల్లేష్ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో 'రైతన్న మీకోసం' నిర్వహిం చారు. ఎఒ బివిజి.సుధాకర్ దొడ్డనకేరిలో పాల్గొని రాబోయే మూడు సీజన్లకు సంబంధించిన వ్యవ సాయ కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఆదోని ఎడిఎ బి.బాలవర్ధిరాజు, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కలెక్టర్‌కు నిరసన సెగ..!

- గ్రామాల విలీనంపై ఆగ్రహం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పర్యటనకు వచ్చిన కలెక్టర్ డాక్టర్ సిరికి నిరసన సెగ తగిలింది. బుధవారం ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామంలో జరిగిన కార్యక్రమం ముగియగానే ఆమె ఆదోనికి చేరుకున్నారు. కలెక్టర్ ఆదోనికి వచ్చారన్న సమాచారం తెలుసుకున్న జిల్లా సాధన కమిటీ సభ్యులు అశోక్, నంద రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి అక్కడికి చేరుకొని ఆదోని జిల్లా చేసేలా ప్రభుత్వానికి నివేదిక పంపాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నూతన మండలంగా ఏర్పాటు కానున్న పెద్దహరివాణంలో గ్రామాలను విలీనం చేయడం సమంజసం కాదంటూ గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌కు భారీగా చేరుకున్నారు. గెస్ట్ హౌస్ ముందు బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు శ్రీకాంత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మదిరే వీరేష్, రామాంజనేయులు, రామస్వామి, ఉదయ్ మాట్లాడుతూ... పెద్దహరివాణం మండలంలో 16 గ్రామాలు విలీనం చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. చాగి, నారాయణపురం, ధనాపురం, గనేకల్, చిన్న గోనెహాలు, చిన్న హరివాణం గ్రామాలను విలీనం చేయకుండా మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి సమాచారం రాగా ప్రభుత్వానికి నివేదించామని కలెక్టర్ చెప్పారు. సబ్ కలెక్టర్ అజయ్ కుమార్‌పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అభిప్రాయ సేకరణ కోసం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశామని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ వివరించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఆయా గ్రామాల పెద్దలు ఆదినారాయణ, సర్పంచి రాము సమావేశానికి వచ్చారని ఆయన వివరణ ఇచ్చారు. తమకు ఎలాంటి సమాచారం లేదని బసాపురం, చిన్న గోనెహాలు, గనేకల్ గ్రామాల ప్రజలు తెలిపారు. తమ గ్రామాలను కలపడానికి ఒప్పుకోమని తేల్చి చెప్పారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కలెక్టర్ సిరి మాట్లాడుతూ... మండలంగా ఏర్పాటు చేస్తామని పెద్దహరివాణాన్ని ప్రభుత్వం ప్రకటించిందని, స్వరూపం ఇంకా ఖరారు కాలేదని తెలిపారు. గ్రామాల ప్రజల నుంచి అభ్యంతరాలు, వినతులు స్వీకరించేందుకు నెల గడువు విధించిందని, ఈ అభిప్రాయాలను కూడా ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు.

పెద్దతుంబలాన్ని మండలంగా చేయాలి : ఆదోనిని జిల్లా చేయాలని, పెద్దతుంబలం గ్రామాన్ని మండలం చేయాలనే ప్రతిపాదనతో కలెక్టర్ సిరికి గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. మండల విభజన సరిగ్గా చేయకపోగా, పెద్దతుంబలానికి మొండి చెయ్యి చూపించడం తగదన్నారు మండలమయ్యే అర్హత ఉన్నా పెద్దతుంబలంపై చిన్న చూపు చూస్తున్నారని వాపోయారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని మండల సాధన కమిటీ సభ్యులు కుల్దీ మోహిద్ తెలిపారు. మదిరే సర్పంచి నారాయణ ఉన్నారు.

గెస్ట్ హౌస్ ముందు బైఠాయించిన గ్రామాల ప్రజలు

CHANGE OF NAME

U.Veerabasappa @ U.Veerabhadrappa S/o Gadhilingappe Residing at 1-62 Teru Veedi, Gulyam(V), Halaharvi(M), Kurnool of DECLARE THAT My Name is Changed from U.Veerabhadrappa (Old Name) to U. Veerabasappa (New Name) Aged 44 Years. as Per **AADAR No: 893092162717.**

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్ట్ మరియు. జె యమ్ ఎఫ్‌సి - కర్నూలు

E.P No: 4/2024 In O.S No:587/2019

టి.గోపాల్ రెడ్డి. ...DHr

-Versus-

జి.వి.లక్ష్మి. ...JDr

JDr కి Order 21 Rule 54 నోటీసులు

To,
జి.వి.లక్ష్మి తండ్రి : శ్రీనివాసరావు
ఇ.నెం: 81-28-A3, రామ్ రహీమ్ నగర్,
కర్నూల్ సిటి & జిల్లా

JDr అయిన మీకు తెలియజేయడమేమనగా గారు తన బాకీ మొత్తం 5,07,541/- రూపాయలు మరియు ఇందుకు అయిన వడ్డీ ఖర్చులు వగైరాలు రాబట్టు కొనుటకు క్రింద కనబరిచిన షెడ్యూల్ దాఖల ఆస్తిని జప్తు కొరకు పైన E.P వేసియున్నారు. పై కోర్ట్ వారు ఇందులో JDr అయిన మీకు పలుమార్లు జెప్తు Rule 54 నోటీసులు పంపినారు. మీకు చేరనందుకు కోర్ట్ వారు మీకు ఈ పత్రిక ద్వారా Rule 54 నోటీసుల తెలుపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున అయిన మీకు యెమైన ఆక్షేపణలు ఉన్న యెడల తేదీ: 15.12.2025వ ఉదయం 10:30 గంటలకు మీరు గాని మీ తరుపున న్యాయవాది గాని పై కోర్ట్ లో హాజరై విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయమైనది.

షెడ్యూల్ ఆస్తి వివరాలు:

కర్నూలు ఓర్వకల్లు సబ్ డి నన్నూరు గ్రామ శివారు లోని సర్వే నెం:773/2 ఏ, విస్తీర్ణము ఏ 2.00 భూమి పేరు పైటోని చేను.

ఇందుకు చెక్కుబంది :
తూర్పు :- బెల్లం శివారెడ్డి భూమి
పడమర:- ఎమ్. పెద్ద మల్లా రెడ్డి మరియు ఇతర భూమి
ఉత్తరము- ఎస్.వీరభద్ర రెడ్డి భూమి
దక్షిణం:- తిరూప రెడ్డి మరియు భాస్కర్ రెడ్డి భూమి

కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ : 15-12-2025

జె.ప్రభాకర్,
MA.Bed.LLB
D.Hr తరపున న్యాయవాది, కర్నూలు.
సెల్:9949931034

ప్రకృతి వ్యవసాయానికి నాంది పలకాలి

- సహకార సంఘం అధ్యక్షులు వెంకటపతి రాజు

ప్రజాశక్తి - కౌతాళం

కృత్రిమ వ్యవసాయానికి స్వస్తి పలికి.. ప్రకృతి వ్యవసాయానికి నాంది పలకాలని సహకార సంఘం అధ్యక్షులు వెంకటపతి రాజు, తుంగభద్ర ప్రాజెక్ట్ ఛైర్మన్ టిప్పు సుల్తాన్, ఎఒ శేషాద్రి, టిడిపి పట్టణ అధ్యక్షులు రాజానందు, కూటమి నాయకులు హుస్సేనప్ప యాదవ్, విజయ్, రామాంజనేయులు తెలిపారు. బుధవారం 'రైతన్న మీకోసం' సమీక్షలు మండలంలోని కౌతాళం, ఉప్పరహాల్, బదినేహాళ్, హాల్వి, కుమ్మలనూరు గ్రామాల్లో నిర్వహించారు. వారు మాట్లాడుతూ... ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారవంతం అవుతుందన్నారు. పంట మార్పిడి, డ్రిప్ ఇరిగేషన్‌తో తక్కువ నీటితో అధిక దిగుబడి, టెక్నాలజీ అనుసంధానంతో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నట్లు తెలిపారు. రసాయనిక ఎరువులు వాడడం వల్ల, ఉత్పత్తి అయిన పంటల నుంచి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. ప్రతి రైతూ సేంద్రీయ ఎరువులు వాడి ఆరోగ్యకరమైన పంటలు పండించాలన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో అధిక దిగుబడులు సాధించాలని కోరారు. వెంకన్న, గొట్టయ్య, సుల్తాన్, రైతు సేవా కేంద్రం సిబ్బంది మౌలాలి, అబ్దుల్, సలీం, మౌనిక పాల్గొన్నారు.

'ఆవాస్ యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం అధ్యక్షులు వెంకటపతి రాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు రాజానందు కోరారు. వారు మాట్లాడుతూ... ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం డిసెంబర్ 14 వరకు గడువు పెంచిందన్నారు. అర్హులైన వారు ఇంజినీరింగ్ అసిస్టెంట్, గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలన్నారు. టిడిపి నాయకులు లింగేష్, గొట్టయ్య, సుల్తాన్, డీలర్ అయ్యప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- జనసేన ఇన్‌ఛార్జీ వెంకప్ప

ప్రజాశక్తి - హాలహర్వి

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ వెంకప్ప తెలిపారు. బుధవారం మండలంలోని క్షేత్రగుడి ఆంజనేయస్వామి కల్యాణ మండపంలో ఆలూరు నియోజకవర్గ ఎన్‌డిఎ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు చింత సురేష్ మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివ ప్రసాద్, జనసేన ఆదోని ఇన్‌ఛార్జీ మల్లప్ప, జనసేన కన్వీనర్ చంద్ర, టిడిపి కన్వీనర్ అసుండి శ్రీధర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకప్ప

అవసరమైతే ఆమరణ దీక్ష

- జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని


సంఘీభావం తెలుపుతున్న నాయకులు

జిల్లా పశ్చిమ ప్రాంతమైన ఆదోని డివిజన్‌ను జిల్లాగా ప్రకటించాల్సిందేనని, నిర్లక్ష్యం చేస్తే ఆమరణ దీక్ష చేపడతామని జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప హెచ్చరించారు. ఆదోని జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలకు బుధవారం మల్లప్ప ఆధ్వర్యంలో జనసేన జిల్లా ఇన్‌ఛార్జీ సురేష్, ఆలూరు ఇన్‌ఛార్జీ వెంకప్ప, పత్తికొండ ఇన్‌ఛార్జీ రాజశేఖర్, ఎపి రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ... ఆదోని ప్రాంతం పూర్తిగా వెనుకబడిందని, జిల్లా ఏర్పడితే నిధులు వస్తాయని తెలిపారు. ఆదోని జిల్లా ఏర్పాటుకు పార్టీలకతీతంగా ముందుకొస్తే జనసేన తరపున ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దగ్గరకు తాము తీసుకెళ్లి చర్చలు చేయిస్తామన్నారు. ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ జనసేన ఇన్‌ఛార్జీలు పార్టీలకతీతంగా నియోజకవర్గాల్లో పోరాటం ఉధృతం చేసి జిల్లాను సాధించుకోవాలని కోరారు. అంతకు ముందు మల్లప్ప, వెంకప్ప మాట్లాడారు. ఆదోని జిల్లా సాధన కమిటీ నాయకులు కృష్ణమూర్తి, వీరేష్, జనసేన నాయకులు తాహేర్ వలీ, రేణు వర్మ, గాజుల రాజశేఖర్, నెల్లిబండ రాజశేఖర్, చంద్రశేఖర్, ఉరుకుందు, విక్రమ్, శ్యామ్, రాకేష్, వెంకటేష్, జయరాం, ప్రకాష్, చిరుత రాజశేఖర్, సాధన కమిటీ సభ్యులు లలిత, కృష్ణమూర్తి, రఘురామయ్యా పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్ల నియామకం

- ఎంఇఒలు సావిత్రమ్మ, ఎస్ఎమ్‌డి.ఫరూక్

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి జిఒ విడుదలయిందని ఎంఇఒలు సావిత్రమ్మ, ఎస్ఎమ్‌డి.ఫరూక్ తెలిపారు. బుధవారం ఎంఆర్‌సి భవనంలో వారు మాట్లాడారు. మండలానికి సంబంధించి ఏడుగురు ఇన్‌స్ట్రక్టర్లను నియమించుకోవడానికి ఆదేశాలు వచ్చాయన్నారు. ఇందులో ఎస్‌జిటి-3, స్కూల్ అసిస్టెంట్-4 ఉన్నాయన్నారు. మండలంలోని ఏరూరు గ్రామంలో ఉన్న ఎంపిపిఎస్ మెయిన్ పాఠశాలలో ఎస్‌జిటి (తెలుగు), జడ్‌పిహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ (హిందీ), స్కూల్ అసిస్టెంట్(సోషల్), గుమ్మనూరు ఎంపిపి పాఠశాలలో ఎస్‌జిటి (తెలుగు), కాజీపురం ఎంపిపి పాఠశాలలో ఎస్‌జిటి (తెలుగు), డేగులహాల్ జడ్‌పిహెచ్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (హిందీ), నగరడోన జడ్‌పిహెచ్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (హిందీ) ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు నేటి నుంచి 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. చిప్పగిరి మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. **నందవరం** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరతను తీర్చేందుకు తాత్కాలికంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఎంఇఒ రఘునాథ్ తెలిపారు. మండలానికి నాలుగు పోస్టులు కేటాయించారన్నారు. నందవరం, నాగలదిన్నె, పూలచింత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 3 ఎస్ఎ (హిందీ) పోస్టులు, నందవరం ఎంపియుపి పాఠశాల(ఉర్దూ)కు 1 ఉర్దూ ఎస్‌జిటి పోస్ట్ మంజూరయినట్లు చెప్పారు.

వికలాంగుల పట్ల బాధ్యతగా ఉండాలి

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

వికలాంగుల పట్ల బాధ్యతగా ఉండాలని, వారు అన్ని రంగాల్లోనూ రాణించే విధంగా సహాయ, సహకారాలు అందించాలని ఎంపిడిఒ అల్లా బకాష్, డిప్యూటీ ఎంపిడిఒలు నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, ఎపిఎం శివయ్య తెలిపారు. బుధవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మండల వికలాంగుల అధ్యక్షులు మునియప్ప, ఉపాధ్యక్షులు గోవిందప్ప ఆధ్వర్యంలో మండల కార్యాలయం నుంచి స్థానిక బస్టాండ్ దగ్గర ఉన్న అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కార్యాలయం దగ్గర వికలాంగులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఒ, పలువురు అధికారులు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులకు వికలాంగులు ఉంటే వారిని ఉన్నత విద్య చదివించాలని, ఏమాత్రం తక్కువ చూపు చూడకుండా వారి పట్ల బాధ్యతగా ప్రవర్తించి వారు తెలివితేటలకు పదును పెట్టాలని తెలిపారు. వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం కూడా పింఛనుతో పాటు అనేక వసతులు కల్పిస్తోందన్నారు. **దేవనకొండ** ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ జ్యోతి, ఎంఇఒ తిమ్మారెడ్డి, ఎపిఎం మాధుల లక్ష్మమ్మ, ఏపీవో రాజు నాయక్, జనసేన ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వెంకప్ప, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, ఎంపిపి భర్త లుముంబా, టిడిపి యువ నాయకులు కాకర్ల శాంతి కుమార్, ఆంధ్రప్రదేశ్ బ్యాంకు మేనేజర్ సుగుణాకర్, ట్రెయినీ ఎస్ఐ నరేష్, ఐఆర్‌టి టీచర్స్, ఆర్‌డిటి సిఇఒ చిన్న ఓబులేసు, ఆర్‌డిటి ఏరియల్ టీం లీడర్ ధనుంజయ, క్రాంతి మండల సమైక్య ప్రెసిడెంట్ ధోని బజారి పాల్గొన్నారు.

గోనెగండ్ల : వికలాంగుల పట్ల సానుభూతితో కాకుండా వారికి సమాజంలో సమాన అవకాశాలు, గౌరవప్రదమైన జీవితం కల్పించడానికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని ఎంఇఒ జి.రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి టి.సతీష్ కుమార్ తెలిపారు. గోనెగండ్లలోని భవిత ప్రత్యేక అవసరాల పిల్లల వనరుల కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని వ్యాపారి ప్రసాద్ శెట్టి సహకారంతో ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు అనురాధ, నారాయణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ... ప్రస్తుతం వికలాంగులు ఆలోచనలకు పదును పెట్టి అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు వైకల్యం ఉందని.. అంధకారంలో ఉంచకుండా మంచి విద్యనందించి వారి మేధస్సుకు పదును పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం వ్యాపారి ప్రసాద్ శెట్టి భవిత పాఠశాలలో 25 మంది వికలాంగ విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేసి.. అతిథులు, ఉపాధ్యాయులకు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. నాయకులు గానిగ బాష, మాలిక్, సుభాన్, గంజిహళ్లి రంగారెడ్డి పాల్గొన్నారు.

చిప్పగిరిలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకాష్

దేవనకొండ

గోనెగండ్ల

IN THE COURT OF THE HON'BLE VIIth ADDL DIST. JUDGE :: KURNOOL:
E.P.No.92/2024 in A.ANo.34/2015

Between:
M/s Shriram Finance Ltd,.
Represented by its GPA Holder.
...Claimant/Decree Holder

-Versus-

Mr.S.Saleem Basha and another.
...Respondents/Judgment Debtors
Mr. 1. S.Saleem Basha
S/o.S.Jani Miah
H no: 4-9-5-2
Balaji Nagar
Kurnool District

1, వ ప్రతివాదులకు ఆర్డర్ 21 రూల్ 37 సి.పి.సి నోటీసు :

పై నంబర్ అమలు అర్జీ (E.P.) లో వాధి Dhr. అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 1వ ప్రతివాదులైన (JDr.1) మీ పైనా ఆర్బిటేషన్ అవార్డును పొంది అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జీ (E.P.) దాఖలు చేసి ఉన్నారు. పై అమలు అర్జీ నందు కోర్టువారు మీకు మీరున్న అడ్రసుకు order 21, Rule. 37, నోటీసులు ఎన్నిసార్లు పంపించిన ఉద్దేశపూర్వకంగా తీసుకోకుండా తిప్పి వెనుకకు పంపుతూ ఉన్నారు. కావునా పై అమలు అర్జీ నందు మీకు ఏమైనా ఆక్షేపనలు వున్న ఎడల పై కోర్ట్ వారి యెదుట 04-12-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు kurnool కోర్టు నందు హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకోవలెను. లేని యెడల పై అమలు అర్జీ మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

తేది: 04.12.2025

S.MADHAVI
M.NARAYANA NAIK
ADVOCAT FOR DIHR KURNOOL

వ్యవసాయం లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

పెద్దటేకూరులో రైతన్న మీకోసం వర్క్ షాప్‌లో గౌరు చరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామం లో రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతన్నా- మీకోసం వర్క్ షాప్ లో ముఖ్య అతిథులుగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు అవగాహన కల్పించడానికి "రైతన్నా- మీ కోసం" కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారని తెలిపారు. అగ్రిటెక్ సాగుకు టెక్నాలజీ తోడైతే ఇక మన రైతులకు తిరుగుండదనీ, అందుకే అగ్రి టెక్ ను ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతీ రైతుకు ఏపి ఫార్మర్ రిజిస్ట్రే పథకంలో 'యూనిక్ ఐడి'ల నమోదుతో ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నామన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల సేద్యాన్ని విస్తరించి, నీటి వినియోగ సామర్థ్యాన్ని 40-50 శాతం వరకు పెంచి రైతు ఉత్పాదకతను పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎస్సి, ఎస్టి రైతులకు బిందు సేద్యం పై గత ప్రభుత్వం రద్దు చేసిన 100 శాతం సబ్సిడీని ఈ ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు. ప్రకాశం, రాయలసీమ జిల్లాల మధ్యతరగతి (10 ఎకరాల లోపు) రైతులకు గత ప్రభుత్వం సబ్సిడీని తగ్గించగా దాన్ని ఈ ప్రభుత్వం 90 శాతానికి పెంచింది అన్నారు యంత్రాలు, టెక్నాలజీ వాడుకతో వ్యవసాయంలో పెట్టుబడి తగ్గుతుందనీ అందుకే వ్యక్తిగతంగా రైతులకు యంత్రాలు సరఫరా చేస్తోంది అన్నారు, కిసాన్ డ్రోన్ సేవలు అందిస్తోంది. పంటల విస్తీర్ణం తెలుసుకోడానికి, పంటల ఆరోగ్యస్థితి అంచనా వెయ్యడానికి శాటిలైట్ టెక్నాలజీ వాడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయ శాఖ మండల అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ ఉలిందకొండ ఈవీ రమణ,మాజీ ఎంపిపి వాకటి మాదేశ్, పెద్దటెకూరు సర్పంచి పద్మావతి గ్రామ నాయకులు వెంకటప్ప, ఎంపీటీసీ ముని స్వామి, నాగరాజు, జగన్నాథం, రఘురాముడు, దొడ్డిపాడుబాష, పుసులూరు సుధాకర్ రెడ్డి, పశు సంవర్ధక శాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతన్న మీకోసంలో మాట్లాడుతన్న ఎమ్మెల్యే గౌరుచరిత

ఆధునిక ఐవిఎఫ్ పద్ధతిలో సంతానోత్పత్తి

-భారీ డిస్కౌంట్ తో అమృత హాస్పిటల్ టెస్టట్యూబ్ బేబి సెంటర్ లో ఐవిఎఫ్ -ఇన్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ ఇ. విజయలక్ష్మి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లోని అమృత హాస్పిటల్ లోని అమృత టెస్ట్యూబ్ బేబి సెంటర్‌లో భారీ డిస్కౌంట్‌తో ఐవిఎఫ్ చేయబడునని ప్రముఖ లాప్రోస్కోపిక్ సర్జన్, ఇన్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ ఇ. విజయలక్ష్మి అన్నారు. డాక్టర్ ఇ. విజయలక్ష్మి ప్రజాశక్తితో మాట్లాడుతూ సాధారణ గర్భం దాల్చలేని జంటలు సంతానోత్పత్తి కోసం బాధపడుతున్న దంపతులకు ఐవిఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) అనే ఈ ఆధునిక పద్ధతిలో మంచి అవకాశమన్నారు. అనేక జంటలు దీనివల్లే తల్లిదండ్రలయ్యన్నారు. ఐవిఎఫ్ అనేది భార్య అండాలను భర్త శుక్రకణంతో ప్రయోగశాలలో ఫలదీకరణం చేసి, ఆపై ఆ ఫలదీకరణం చెందిన పిండాన్ని గర్భాశయంలో అమర్చే ఒక సహాయక పునరుత్పత్తి ప్రక్రియ అని అన్నారు. దీని ద్వారా అనేక జంటలు దంపతులయ్యారని, రాయలసీమలోనే అత్యధిక సక్సెస్ రేట్ కలిగిన ఏకైక ఫెర్టిలిటి సెంటర్ అని తెలిపారు. ఇది లక్షలలో ఖర్చు అవుతుందని క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా భారీ డిస్కౌంట్ తో కేవలం రూ.89,999 రూ.లకే ఐవిఎఫ్ చేయబడని తెలిపారు. రిజిస్ట్రేషన్ తేది 1 డిసెంబర్ 2025 నుండి 31 డిసెంబర్ 2025 చేయబడునని తెలిపారు. ఉచిత కన్సల్టేషన్, ఉచిత స్కానింగ్, ఉచిత కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అపాయింట్ మెంట్ కొరకు ఫోన్: 08518-232046, 229398 సెల్:7671894442 సంప్రదించాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు పని భారం తగ్గించాలి

-వయోపరిమితిపేర తొలగించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను 60 సంవత్సరాల నిండాయని తీసివేసిన 20 మంది కుటుంబాలలో ఒక్కొక్కరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ టిఎన్‌టియుసి యూనియన్ జిల్లా అధ్యక్షులు వైవి రమణ ఆర్గనైజింగ్ అధ్యక్షులు ఎం వి. నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న ఆప్కాస్, పర్మనెంట్, అదనపు కార్మికులు టాయిలెట్ వర్కర్లు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో దాదాపు 23 సంవత్సరాలు పైబడి పని చేసి తొలగించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం 20,000 జీతం ఇస్తూ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగ గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులుగా ప్రకటించారు. దీంతో వీరి కుటుంబాలు జీవనం దుర్భరంగా మారిందన్నారు. ప్రజా ఆరోగ్య విభాగంలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికుల సేవలు వెలకట్టలేనివని, వారు పనిచేయడం వల్లే ప్రజల ఆరోగ్యాలు బాగున్నాయన్నారు. వారి జీవితాలను అనారోగ్యాల బారిన పడిన ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ వర్తింప చేసినప్పటికీ వారి పుట్టిన తేది సరిగా లేదనే ఉద్దేశంతో సక్రమంగా జమ చేయడం లేదన్నారు. ఆప్కాస్ ఉద్యోగులు 665 మంది, పర్మినెంట్ ఉద్యోగులు 268 మంది, అదనకు వర్కర్లు 200 మంది, టాయిలెట్ వర్కర్స్ 98 మంది పనిచేస్తున్నారు. వీరికి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వారి బ్యాంకు ఖాతాల్లో ఎవరి జీతాలు వారికి పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీరికి పథకాలు ఏవి వర్తించడం లేదన్నారు. దీంతో వారి పిల్లలు చదువులు వయోవృద్ధుల పింఛన్లు, వితంతువుల పింఛన్లు ఏవి వారికి అందరం లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేల రూపాయలు ఇవ్వాలి లేదా వీరికి సంక్షేమ పథకాలు అన్నా వర్తింపచేసేలా అధికారులు ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. అనంతరం వినతి పత్రాన్ని ప్రజారోగ్యాధికారి డాక్టర్ నాగప్రసాద్ బాబుకు అందజేశారు. అందుకు ఆయన స్పందిస్తూ మీ వినతిని అధికారులు దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని హామీ ఇచ్చారు

కార్పొరేషన్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న టిఎన్‌టియుసి నాయకులు

ఎక్స్‌రే యంత్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్యాంబాబు

- రైతన్న మీకోసంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -వెల్దుర్తి

మండల కేంద్రమైన వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నూతన ఎక్స్ రే యంత్రాన్ని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌తో కలిసి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. సూపరిండెంట్ బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ జప్రుల్లా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను, వైద్యుల పనితీరును, ఆసుపత్రి వసతుల గురించి ఎమ్మెల్యే శ్యాంబాబు కు తెలియజేశారు. ఆసుపత్రిలో జనరేటర్ ఏర్పాటు కొరకు సొంతంగా నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. 30 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.... రైతుల సేవలో టిడిపి ప్రభుత్వం వెల్దుర్తి రైతుసేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన రైతన్న మీకోసంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొన్నారు. రైతులకు వ్యవసాయం లాభసాటి చేసేలా ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిం దన్నారు. పత్తికొండ నియోజకవర్గం లో అన్ని మండలాల చెరువులకు నీటిని అందించిన ఘనత మాజీ ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తికి దక్కుతుందన్నారు. మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్ గౌడ్, జిల్లా నాయకులు సుబ్బరాయుడు, సింగిల్ విండో చైర్మన్ రమాకాంత్ రెడ్డి, తాసిల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీవో సుహాసినమ్మ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జెసి

2వ సౌత్ జోన్ సిలంబం చాంపియన్ షిప్ పోటీలకు కర్నూలు విద్యార్థులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఈ నెల 6, 7వ తేదీలలో గుంటూరు జిల్లాలో జరగబోయే 2వ సౌత్ జోన్ సిలంబమ్ చాంపియన్ షిప్ పోటీలకు కర్నూలు విద్యార్థులు ఎంపికయ్యారు. కర్నూలు జిల్లా సిలంబమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటరమణ కాలనిలోని సహస్ర స్కూలులో నిర్వహించిన ఎంపిక పోటీలకు ముఖ్య అతిథులుగా వచ్చిన వికాస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత వికాస్, సహస్రస్కూలు యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు ఆర్.అన్నపూర్ణ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. వారికి టీషర్ట్స్ పంపిణి చేసి విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కుర్నూలు జిల్లా అసోషియేషన్ కార్యదర్శి బి.మహవీర్, బి.బహదూర్లకు అభినందనలు తెలిపారు.

నేడు నంద్యాలలో ఎన్‌జిఒ కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉమ్మడి కర్నూలు జిల్లా ఎన్‌జిఒ కార్యవర్గ సమావేశం నంద్యాలలో నిర్వహిస్తున్నట్లు ఎపిఎన్‌జిఒ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి నగర అధ్యక్షుడు కాశన్నలు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్ రమణాలు పాల్గొంటారన్నారు. జిల్లాలోని అన్ని తాలూకా కమిటీల నాయకులు హాజరుకావాలని పేర్కొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ లో నలుగురు డీబార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడుతూ బుధవారం డీబార్ అయ్యారు. ఈ పరీక్షకు 7566 మంది విద్యార్థులు హాజరు కాగా834 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

మొండి బకాయిదారులపై ఉదాసీన వైఖరి వీడండి

-ప్రతి రోజూ 2 డిస్ట్రెస్ వారెంట్లు జారీ చేయండి

-వారంలోపు చెల్లించకుంటే వారి ఆస్తులు జప్తు

-ప్రతి రోజూ ఎసి, డిసి, నోడల్ అధికారులు పర్యవేక్షించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో సంవత్సరాల తరబడి రూ.లక్షల పన్నులు చెల్లించకుండా మొండి బకాయిదారులుగా మారిన వారిపై ఉదాసీనత వైఖరి వీడి, వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో అదనపు కమిషనర్ ఆర్‌జివికృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, ఆర్వోలు, నోడల్ అధికారులతో పన్ను వసూళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో మొండి బకాయిలను రాబట్టేందుకు అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్, నోడల్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ పెట్టాలని, వారివారి పరిధిలో ఉన్న మొండి బకాయిదారులకు తక్షణమే రెడ్‌నోటీసులు జారీ చేయాలని సూచించారు. అయినప్పటికీ స్పందన లభించని వారికి డిస్ట్రెస్ వారెంట్లు జారీ చేసి, వారంలోపు చెల్లించకపోతే ఆస్తుల జప్తు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు.

నగరంలో అధిక బకాయిలు కలిగిన వ్యాపార, వాణిజ్య సంస్థలను రోజువారీగా 2 నుంచి 3 చొప్పున సీజ్ చేయాలని, ఇందులో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకున్నా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విధులను సమర్థవంతంగా నిర్వర్తించడంలో ఎలాంటి ఒత్తడిలకు తలొగ్గదని స్పష్టం చేశారు. అదేవిధంగా ట్రేడ్‌లైసెన్స్ బకాయిలు, వినోద పన్నుల వసూళ్లను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, ఆర్వోలు జునైద్, వాజీద్, ఎంహెచ్ఒ నాగశివప్రసాద్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఇంటి నిర్మాణానికి రూ.1,59,000 బిల్లు మంజూరు

- హౌసింగ్ ఎఇ సురేష్

ప్రజాశక్తి మద్దికేర

కొత్త ఇంటి నిర్మాణంకోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రూ.1,59000 బిల్లు మంజూరైనట్లు హౌసింగ్ ఎఇ సురేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి లక్ష ఇరవై వేలు, బాత్రూంకి రూ.12000, ఉపాధి హామీ బిల్లు రూ.27,000 మొత్తం బిల్లు రూ.1,59,000 వస్తుందని పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ పరిధిలో ఉన్న సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా ఖాళీ స్థలం బేస్ మేట్ లెవెల్, లింటిల్ లెవెల్, వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆర్ సి వేసిన ఇండ్లకు పూర్తిగా ఇంటి నిర్మాణమై రంగుల కొట్టిన ఇండ్లకు బిల్లు రాదని స్పష్టం చేశారు. లబ్ధిదారులు డిసెంబర్ 14 తేదీ వరకు గడువు పెంచారని, ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.